# గ్లాస్‌మేట్స్!

సుబ్రమణ్యం టీ తాగుతూ కూర్చున్నాడు వంచిన తల ఎత్తకుండా ఫైలునే చూస్తూ.

"ఏంటీ అంత సీరియస్‌గా ఫైలు చదివేస్తున్నావ్?" పలకరించారు జగదీశ్వర్రావుగారు.

"మన చైర్‌మన్‌గారి ఫైలు! ఆయన మొన్న టూర్ వెళ్లొచ్చారుకదా, దాని తాలూకు బిల్లూ, వ్యవహారం చూస్తున్నాను. ఓసారి చెక్‌చేసి పంపించేస్తే వాళ్లే చూసుకుంటారు స్టాపు". టీ త్రాగడం పూర్తిచేసి కప్పు క్రింద పెడుతూ "టీ తాగుతావా?" అడిగారు సుబ్రమణ్యంగారు, అకౌంట్స్ ఇన్‌చార్జ్!

"వద్దు! నీకు తెలుసా మన కాశీనాథ్‌ని విశాఖపట్టణంకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడట!" మెల్లగా రహస్యం చెప్పినట్టుగా చెప్పారు జగదీశ్వర్రావుగారు.

సుబ్రమణ్యంగారు ఒక్క నిమిషం ఆశ్చర్యంగా చూసి "నీ పిచ్చిగానీ కాశీనాథ్‌గారిని ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేస్తారు. ఆయన ఏ చైర్‌మన్‌కైనా రైట్‌హాండ్‌గా పనిచేస్తాడు. నిజాయితీపరుడూ, కష్టపడి పనిచేసేవాడూను. పైగా కంపెనీ వ్యవహారాలన్నీ స్వయంగా శ్రద్ధగా చూసుకుంటాడు. ఒకరకంగా చెప్పాలంటే అతను కంపెనీకే ఒక 'ఎస్సెట్'! అతని పౌరసంబంధాలు కంపెనీకే ఎక్కువగా పనికొస్తాయ్. అటువంటి మనిషిని విశాఖపట్టణానికి బదిలీచేస్తే కష్టం కదూ! అయినా నువ్వేదో పుకారు విని వుంటావ్" కొట్టిపారేస్తూ అన్నారు సుబ్రమణ్యంగారు.

"పుకారు కాదులేవోయ్!" మరింత గట్టిగా బల్లగుద్దినట్లు చెప్పారు జగదీశ్వర్రావుగారు.

"చూడు జగదీశ్వర్రావ్ నేనూ చైర్మన్‌గారూ చిన్నప్పుడు క్లాస్‌మేట్స్‌మని చెప్పానా? ఈ ఆరు నెల్లనుంచీ మనకి అతను చైర్‌మన్ అయి వచ్చారుకానీ లేకపోతే మేమిద్దరం ఒరేయ్ అంటే ఒరేయ్ అనుకుంటాంకదా. ఆ సంగతి నీకూ తెలుసుకదా. ప్రతి విషయం మేము మాట్లాడుకునేవాళ్లం. అటువంటిది ఈ

మాట నాతో మాట మాత్రమైనా అనడూ? నువ్వేదో రూమర్ మోసుకొస్తున్నావ్! పుకార్లకు పుట్టిల్లు మన కంపెనీ" అన్నారు సుబ్రమణ్యంగారు నవ్వుతూ.

జగదీశ్వర్రావుగారు నవ్వుతూ సిగరెట్ వెలిగించారు. గట్టిగా ఓ దమ్ములాగి సుబ్రమణ్యంకేసి చూశారు. సుబ్రమణ్యం! మామూలుగా అయితే నువ్వు చెప్పేది నేను ముమ్మాటికీ నమ్ముతాను. కానీ "న్యూస్ ఫ్రమ్ హార్సెస్‌మౌత్!" అదీ నమ్మొద్దంటావా? అడిగారు.

"ఏమిటీ? చైర్మన్‌గారు నీకు స్వయంగా చెప్పారంటావా?" ఎగతాళిగా అడిగాడు.

"అవును" అంటూ మరో దమ్ము సిగరెట్టు పీల్చాడు.

"మన కాశీనాథ్ అతనికేదో చుట్టమవుతాట్ట. ఆ సంగతి అతనికి మొన్ననే తెలిసిందట. అప్పటినుంచీ డెలికేట్‌గా ఫీలవుతున్నాట్ట. అందుకే విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ చేస్తున్నానని చెప్పారు." సిగరెట్ మరో దమ్ములాగాడు నవ్వుతూ.

"నాకు చెప్పలేదే ఇదంతా! కొంచెం బాధపడుతూ బాధ పైకి కనబడకుండా వుండడానికి ప్రయత్నం చేస్తూ చెప్పారు సుబ్రమణ్యంగారు.

"నువ్వు క్లాస్‌మేట్‌వి! నేను గ్లాస్‌మేట్‌ని! నీతో చెప్పవలసినవి కొన్నుంటాయ్, కొన్నుండవు. కానీ నాతో అలాక్కాదు. ఒక్కసారి మేము 'ఛియార్స్' అని గ్లాసు పుచ్చుకున్నాక మా మధ్య అంతరాల భేదం కానీ కులమత భేదంకానీ ఏవీ వుండవు. అందరం ఒకటిగానే భావిస్తాం. నన్నడిగితే అసలైన సిసలైన సమానత్వం ఈ గ్లాస్‌మేట్స్ మధ్యే ఉంటుందయ్యా" అన్నాడు సిగరెట్టుని చివరిసారిగా పీల్చేసి ఆష్‌ట్రేలో పడేస్తూ. సుబ్రమణ్యంగారు నోరు తెరుచుకుని వింటున్నారు జగదీశ్వర్రావుగారి మాటలు!

"మేమిద్దరం మొన్న క్లబ్బులో కలుసుకున్నాం. గ్లాసు పుచ్చుకోగానే తేడాలు మర్చిపోయాం. ఆయన ఎంతో చక్కగా ఎన్నో విషయాలు మాట్లాడారు. అప్పుడు చెప్పారు ఈ విషయం" అన్నాడు. అంతలో బంట్రోతొచ్చి సార్ మిమ్మల్ని చైర్‌మన్‌గారు పిలుస్తున్నారు" అన్నాడు జగదీశ్వర్రావుకేసి చూస్తూ. జగదీశ్వర్రావు గబగబా వెళ్లిపోయాడు చైర్మన్ గదిలోకి! సుబ్రమణ్యంగారు మతిపోయినట్లు చూస్తుండిపోయారు.

"నాన్నా మీ కంపెనీలో టైపిస్ట్ ఉద్యోగానికి నా ఫ్రెండ్ అక్కయ్య అప్లయ్ చేసింది. నువ్వూ చైర్మన్‌గారూ క్లాస్‌మేట్స్‌కదా, కాస్త మాట్లాడి నా ఫ్రెండ్ అక్కయ్యకి ఆ ఉద్యోగం వచ్చేలా చూడు నాన్నా! పాపం, వాళ్లు చాలా కష్టాల్లో ఉన్నారు. వాళ్ల నాన్నగారు ఈ మధ్యనే పోయారు. ఈ ఉద్యోగం ఆ అమ్మాయికి ఎంతో అవసరం నాన్నా" అంది అవంతి!

సుబ్రమణ్యంగారు ఆలోచిస్తున్నారు.

"నేను చెప్పేది వినడంలేదా నాన్నా?" కోపంగా అడిగింది అవంతి.

ఉలిక్కిపడి ఆలోచనల్ని కట్టిపడేసి "అమ్మా అవంతీ! ఈ రోజుల్లో క్లాస్‌మేట్లయినంత మాత్రాన పనులు జరుగవమ్మా. గ్లాస్‌మేటయి వుండాలి!" అన్నారు.

"అంటే ఏంటి నాన్నా!" అర్థంకాక అడిగింది అవంతి.

"అదేనమ్మా! డ్రింక్స్ తీసుకోవాలి! అప్పుడు కలిపి తాగే అవకాశం వస్తుంది! ఆ మైకంలో ఏది అడిగినా ఏది చెప్పినా చెల్లిపోతుంది" నవ్వుతూ చెప్పారు సుబ్రమణ్యంగారు.

అవంతి అయోమయంగా అతనికేసి చూసింది!

*